జిల్లా ఫైర్ ఆఫీసర్ బాధ్యతల స్వీకరణ

సాయిరాజేష్

కాకినాడ: కాకినాడ జిల్లా అగ్నిమాపక అధికారిగా పి.వేంకట సాయిరాజేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లా డుతూ 2022 బ్యాచ్ గ్రూపు-1 అధికారిగా రాష్ట్ర అగ్నిమాపక శాఖకు ఎంపికయినట్లు చెప్పారు. సత్తెనపల్లి, విశాఖపట్నంలో శిక్షణ తీసుకున్నానని, తొలి పోస్టింగ్ కాకినాడ జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా వచ్చిందన్నారు. జిల్లా అధికారుల సూచనలు, 7 అగ్నిమాపక కేంద్రాలలోని అధికారులు, సిబ్బంది సహకారంతో విధులు నిర్వహిస్తానని తెలిపారు. ఆయనకు ఎడిఎఫ్ఓలు వి.సుబ్బారావు, యేసుబాబు, కొమర రాముడు, సూపరిం టెండెంట్ జిఎస్ఎ.వినాయక్, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్, జెసి, డిఆర్ఓలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

అరకొరగానే కూలి

- కష్టాల్లో బేవరేజెస్ హమాలీలు
- భారంగా మారిన కుటుంబ పోషణ
- కానరాని పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం
- పట్టించుకోని సిగ్మా యాజమాన్యం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రెక్కలు ముక్కలు చేసుకుని రోజంతా కష్టపడితే అరకొర కూలి దక్కుతుంది. ఏళ్ల తరబడి ఇక్కడే పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి లభించని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తమను గుర్తించకపోవడంతో ఇఎస్ఐ, పిఎఫ్ వంటి కనీస సౌకర్యాలు కానరావడం లేదు. పని ప్రదేశంలో భద్రతా సౌకర్యాలు కనుమరుగయ్యాయి. ప్రమాద బీమా సౌకర్యం సైతం లేకుండా పోయింది అంటూ బేవరేజెస్ హమాలీలు మరోవేదనకు గురౌతున్నారు.

ఆంధ్రప్రదేశ్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌బిసిఎల్), ఇండియన్ మేడ్ ఫారన్ లిక్కర్ (ఐఎంఎఫ్) డిపోలు ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల ఉన్నాయి. వీటిలో కాకినాడ జిల్లా సామర్లకోటలో ఒకటి, తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలో ఒకటి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఒకటి ఉన్నాయి. సామర్లకోటలో 63 మంది, రాజమహేంద్రవరంలో 50 మంది, అమలాపురంలో 60 మంది బేవరేజెస్ హమాలీలుగా గత 30 ఏళ్లుగా పని చేస్తున్నారు. రాష్ట్రానికి ప్రధాన ఆదాయవనరుగా ఉన్న మద్యం సీసాలను డిపోల్లో ఎగుమతి, దిగుమతిలు వీరితోనే జరుగుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మద్యం వ్యాపారం తిరిగి ప్రయివేటు వ్యాపారుల చేతుల్లోకి వెళ్ళింది. గత 20 రోజుల నుంచి పెద్ద ఎత్తున మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో హమాలీలకు పని అధికం అయింది. అయితే వచ్చే కూలీ డబ్బుల్లో మాత్రం మార్పులు కనిపించడం లేదని హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రమ దోపిడీ షురూ..

ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల వల్ల రోజు రోజుకి నిత్యవసరాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. హమాలీల శ్రమను దోచుకుంటున్న సిగ్మా యాజమాన్యం మాత్రం వీరి కూలీరేట్లను పెంచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని హమాలీలు అనేకసార్లు ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయింది. అయినా ప్రభుత్వం గాని, యాజమాన్యం గానీ స్పందించడం లేదు.

కనిపించని కనీస సౌకర్యాలు

ఎగుమతులు దిగుమతి సమయాల్లో హమాలీలకు బేవరేజస్ కంపెనీ వద్ద యాజమాన్యం కనీస సౌకర్యాలు కూడా కల్పించలేక పోతుంది. మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్, కనీసం భోజనాలు చేసేందుకు కూడా సరైన వసతులు కూడా లేవు. లోడింగ్, అన్ లోడింగ్ చేసే సమయాల్లో ఒక్కోసారి బీరు బాటిల్లు పగిలిపోయి గాయాలు పాలవుతున్నా పట్టించుకునే నాథులు లేరు. పీఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కూడా లేకుండానే భద్రత లేని బతుకులతో కూలీలు విధులు నిర్వర్తిస్తున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ గాని, ఇళ్ల స్థలాలు గాని ఇవ్వడం లేదని కార్మికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని చెబుతున్నారు.

సౌకర్యాలు లేవు

పని ప్రదేశంలో ఎటువంటి సౌకర్యాలు లేవు. భోజనాలు చేసేందుకు వసతి సక్రమంగా లేకపో వడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ఉద్యోగ భద్రత లేదు. ఎగుమతి కూలి రేట్లు పెంచాలనే హమాలీల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్క రించాలి. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యా లు కల్పించాలి. తమను నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

-వి.అప్పలరాజు, డిపో యూనియన్ కార్యదర్శి

కూలి రేట్లు పెంచాలి

డిపో ప్రారంభం నుంచి 30 సంవత్సరాలుగా పని చేస్తున్నాను. అప్పటి నుంచి ఎగుమతి కూలీ రేట్లు పెరగలేదు. పెరుగుతున్న ధరల వలన అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఒక్కో బాక్స్‌కు రూ.8 ఇస్తున్నారు. దీనిని కనీసం రూ.10కి పెంపుదల చేయాలి.

బుర్రే ఆదినారాయణ, డిపో అధ్యక్షుడు
హమాలీ వర్కర్స్ యూనియన్

సమస్యలను పరిష్కరించాలి

బేవరేజస్ హమాలీల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం. మద్యం వ్యాపారంలో ఆదాయం ప్రభుత్వానికి దండిగా వస్తున్నప్పటికీ వాటిని పెంచేందుకు తమ వంతు కృషి చేస్తున్న హమాలీలను మాత్రం నిర్లక్ష్యం చేస్తుంది. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

వి. కొండలరావు, రాష్ట్ర కార్యదర్శి
హమాలీ వర్కర్స్ యూనియన్

నేటి నుంచి ప్రజాపోరు

సిపిఎం సన్నద్ధం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

'ప్రజా పోరు' పేర ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం సిద్ధమైంది. సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటూ వాటి పరిష్కారం కోసం ప్రజా ఉద్యమానికి సంకల్పించింది. సమస్యలపై ప్రజాగళాన్ని ప్రభుత్వానికి వినిపించేందుకు సన్నద్ధమైంది. ఈ నెల 8వ తేదీ నుంచి 14 వరకూ వివిధ కార్యక్రమాలను నిర్వహించనుంది.

పెరుగుతున్న అధిక ధరలకు వ్యతిరేకంగా మహిళలు, బాలికలపై పెరుగుతున్న అఘాయిత్యాలకు, దాడులకు వ్యతిరేకంగా, జమిలీ ఎన్నికలను నిరసిస్తూ అలాగే జిల్లాలో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. శుక్రవారం నుంచి ఈ నెల 14 వరకు అన్ని మండలాల్లోనూ వీధి మీటింగులు, కరపత్రాలు పంపిణీ, ప్రజా సమస్యలపై ప్రచారం, ర్యాలీలను నిర్వహించనుంది. అనంతరం ఆయా మండల కార్యాలయాలు వద్ద సమస్యలు పరిష్కారం కోసం ధర్నాలకు పిలుపునిచ్చింది. గత వైసిపి, ప్రస్తుత కూటమి పాలనకు ఎలాంటి మార్పు కనిపించని పరిస్థితిని ప్రజల్లోకి తీసుకెళ్లనుంది. మహిళలపై, బాలికలపై నేటికీ దాడులు జరుగుతూనే ఉన్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చినా దళితులపై దాడులు, హత్యలు ఆగలేదు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తరచూ శాంతి భద్రతలపై మాట్లాడుతున్నారు. కాని కానీ వాస్తవ పరిస్థితుల్లో శాంతి భద్రతల విషయంలో కూటమి సర్కారు ఎలాంటి చర్యలూ తీసుకున్న దాఖలాలు లేవు. కూరగాయలు, పప్పులు, నూనెలు, బియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోయి పేద, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 16 రకాల నిత్యావసరాల సరుకుల ధరలను ప్రభుత్వం నియంత్రణలో ఉంచి రైతు బజార్లు, సచివాలయాల ద్వారా సబ్సిడీకే సరుకులను పంపిణీ చేస్తే ధరలను అదుపు చేయొచ్చు. కాని అలాంటి చర్యలేవీ ప్రభుత్వం తీసుకోలేదు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతునే ఉంది. కొత్తగా జమిలి ఎన్నికల పేరుతో భారత రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతుంది. దీనిపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా మొండిగా ముందుకు పోతోంది.

జిల్లాలో ప్రధానంగా ఏలేరు ఆధునికీకరణ లేకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఈ ఏడాది ఏలేరుకు వచ్చిన వరదలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతాంగాన్ని పూర్తిస్థాయిలో ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. సబ్ ప్లాన్ గిరిజన ప్రాంతాల సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేనేలేవు. చెరకు రైతుల సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. చెరకు ఫ్యాక్టరీ కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. రైతులకు పెట్టుబడి సాయం నేటికీ అందలేదు. కొనుగోలు కేంద్రాలున్నా రైతులకు లాభం చేకూరడంలేదు. జిల్లాలో రోడ్ల పరిస్థితి మరీ దయనీయం. పట్టు పరిశ్రమ రైతులను ఆదుకునేవారే కరువయ్యారు. పట్టురైతులకు ఎన్నికలకు ముందు డిప్యూటీ సీఎం ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదు. జీడిపిక్కల ఫ్యాక్టరీల్లో మహిళా కార్మికుల శ్రమదోపిడీ సాగుతూనే ఉంది. జీడిపిక్కల రైతులకూ గిట్టుబాటు ధర ఉండట్లేదు. ఈ సమస్యలపై ప్రజపోరుకు సిపిఎం సిద్ధపడింది.

ప్రజా పోరుకు ప్రజలూ సహకరించాలి

జిల్లాలో పలు సమస్యలు తాండవిస్తున్నాయి. నేటికీ పరిష్కారానికి నోచుకోని సమస్యలు కోకొల్లలు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలయిన దాఖలాలు లేవు. ప్రభుత్వాలు మారినా మహిళలు, బాలికలు, దళితులపై దాడులు ఆగడం లేదు. అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యాలుగా మారాయి. ధరల దరువుతో సామన్యుడు జీవించలేని పరిస్థితి నెలకొంది. ప్రజలు, రైతులు, కార్మికులు ఇలా అన్నిరంగాల వారూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలపై పరిష్కారం కోసమే ప్రజాపోరు నిర్వహిస్తున్నాం. ప్రజాగళాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా ఒత్తిడి తేవడమే లక్ష్యంగా ప్రజాపోరు సాగిస్తాం.

- ఎం.రాజశేఖర్, సిపిఎం జిల్లా కన్వీనర్, కాకినాడ

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

అమరవీరులకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక క్వారీ లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సిపిఎం సమావేశం జరిగింది. సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన పాల్గొని సిపిఎం పతాకాన్ని ఆవిష్కరిం చారు. అనంతరం సిపిఎం జాతీయ ప్రధాన కార్య దర్శి సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకున్న ప్రజలపై అధికా రంలోకి వచ్చిన వెంటనే వివిధ రూపాలోల భారా లు మోపిందన్నారు. నిత్యవసర వస్తువులు, కూరగాయలు, వంట నూనెలు ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో సర్‌ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలను పెంచడం దారుణమన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మూతపడ్డ ఫ్యాక్టరీలను తెరిపిం చాలని, నూతన ఫ్యాక్టరీల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం కన్వీనర్‌గా రొంగల ఈశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా పాకలపాటి సోమరాజు, పిల్ల రాంబాబు, నిట్ల శ్రీను ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పోసపల్లి రమణ, టి.శివదుర్గ, ఆర్.సత్య నారాయణ, టి.వెంకట్రావు, వి.దొంగబాబు, ఎస్. బాలమ్మ, ఆర్.బాలా త్రిపుర సుందరి పాల్గొన్నారు.

14వ రోజుకు క్లాప్ డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి - కాకినాడ

మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

మున్సిపాలిటీ నుంచి సిడిఎంఎకు రూ.30 లక్షలు పంపించినా నేటికీ క్లాప్ వాహన డ్రైవర్ల బకాయి జీతాలు పడలేదు. తమ జీతాల వచ్చేంత వరకూ ఆందోళన కొనసాగిస్తామని నగర పాలక సంస్థ కమిషనర్‌కు యూనియన్ నేతలు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే 14వ రోజు ఆందోళనను కొనసాగింపుగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ క్లాప్ డ్రైవర్లు ధర్నాను కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ మాట్లాడుతూ రోజులు గడుస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లు జీతాలు మాత్రం వేయడంలో అధికారులకు చొరవ చూపడం లేదన్నారు. తక్షణమే కాంట్రాక్టర్‌తో మాట్లాడి 3 నెలల బకాయి జీతాలు చెల్లించేలా, కట్ చేసిన 9 నెలల పిఎఫ్ సొమ్మును క్లాప్ డ్రైవర్ల ఖాతాకు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా క్లాప్ వాహన డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి నేటికీ కనీసం గుర్తింపు కార్డులు ఇచ్చిన పరిస్థితి నగర పాలక సంస్థకు లేదన్నారు. దీనిని బట్టే డ్రైవర్ల పట్ల అధికారులు ఎంత చిన్నచూపు చూస్తున్నారనేది స్పష్టం అవుతుందన్నారు. తక్షణం గుర్తింపు కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత 13 రోజులుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఎంతగా గొగ్గోలు పెట్టినా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని, అందుకే 14వ రోజున నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని మౌనంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, విక్టర్, కొండబాబు, శివశంకర్, గంగాధర్, టి శ్రీను, దుర్గాప్రసాద్, కుమార్, శివ, భైరవ స్వామి, ఆర్ వెంకటేష్, సూరిబాబు పాల్గొన్నారు.

సిపిఎం మహాసభలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురంలో సిపిఎం జిల్లా మహాసభల గోడరాతల ప్రచారం

పెద్దాపురం పట్టణంలో ఈ నెల 15,16, 17 తేదీల్లో జరిగే సిపిఎం కాకినాడ జిల్లా 24వ మహాసభలకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు అన్నారు. గురువారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పచార కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధిలోను, గ్రామాల్లోనూ సిఐటియు నాయకులు గూనూరు వెంకటరమణ, సిపిఎం కాకినాడ నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఆధ్వర్యంలో గోడ రాతలను నిర్వహిస్తున్నారన్నారు. 16 వ తేదీన ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఈ సభలో ప్రసంగిస్తారన్నారు. ఈ మహాసభల విజయవంతానికి ప్రజలు సంపూర్ణ సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ డి.క్రాంతికుమార్, సిరపరపు శ్రీనివాస్, నెక్కల నరసింహమూర్తి, బంగారు రాజు, సురేష్ పాల్గొన్నారు.

నేరాల అదుపునకు సిసి కెమెరాలు దోహదం

ప్రజాశక్తి - సామర్లకోట

రైల్వే స్టేసన్ సెంటర్లో భద్రతపై సూచనలు ఇస్తున్న డిఎస్‌పి

పట్టణంలో నేరాల అదుపునకు సిసి కెమెరాలు దోహదం చేస్తాయని డిఎస్‌పి కె.శ్రీహరిరాజు అన్నారు. గురువారం స్థానిక స్టేషన్‌సెంటర్, ఆర్‌టిసి బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాలను ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా వ్యాపారులు, ఆర్‌టిసి, రైల్వే అధికారులతో ఆయన మాట్లాడారు. ఎవరి పరిసరాల్లో వారు సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను అదుపు చేయవచ్చునన్నారు. యువత ఆగడాలు, గంజాయి వినియోగం, దొంగతనాలు, ఈవిటీజింగ్ వంటి నేరాలన్నింటికీ సిసి కెమెరాల ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. ఇప్పటి వరకూ సిసి కెమెరాలు ఏర్పాటు చేయని వ్యాపారులు త్వరితగతిని ఏర్పాటు చేసుకోవాలని, పని చేయని కెమెరాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు దృష్టి సారించాలని సూచించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ల ఆవరణల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నేరాల అదుపునకు అధికారులు సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో స్థానిక సిఐ కృష్ణ భగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు పాల్గొన్నారు.

వాహనదారులకు బహుమతులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

వాహనదారునికి బహుమతి ఇస్తున్న ఎస్ఐ రామకృష్ణ

ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతే చలానాలు వేయడం పరిపాటి. అయితే గొల్లప్రోలు పోలీసులు వినూత్నంగా నిబంధనలను పాటించే వారికి బహుమతులు అందించడం చర్చానీయాంశంగా మారింది. గురువారం స్థానిక టోల్‌గేట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ఉల్లంఘించిన వారిపై ఇ చలానాలు రాసి జరిమానాలు వేశారు. అలాగే హెల్మెట్లు ధరించిన మోటార్ సైకిల్ రైడర్లకు ఆత్మీయ అభినందనగా ఎస్ఐ రామకృష్ణ బహుమతిని అందజేయడం అందరినీ ఆకట్టుకుంది.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు

ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని నాగులపల్లి పిహెచ్‌సి వైద్యులు రీఛాశర్మ, గౌరీ అన్నారు. గురువారం నాగులపల్లి గ్రామంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు పరీక్షలు ద్వారా క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చునని తెలిపారు. స్క్రీనింగ్‌తో క్యాన్సర్‌పై విజయం సాధించే అవకాశం ఉందన్నారు. ఇంటి వద్దకు వచ్చి 18 సంవత్సరాలు నిండిన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నిర్లక్ష్యం, సందేహించకుండా వైద్య పరీక్షలు చేసుకుంటే ముందస్తుగా రోగాలను అరికట్టడానికి అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జ్యోతి రత్నకుమారి, పి.ఝాన్సీ, ఆగ్నేస్ మిరియం, ఆశస్, కాకరాపల్లి గంగాధర్ శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, నాగు, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



'ఉపాధి' పని దినాలను పెంచాలి

ప్రజాశక్తి - కాకినాడ

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

జిల్లాలో ఉపాధి హామీ పని దినాల సంఖ్యను పెంచడంతోపాటు గ్రౌండింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఇంజనీరింగ్ అధికారులు, ఎపిడి, ఎపిఒ, డిఇ, ఈఈలతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పథకం పని దినాలు సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. సిసి రోడ్లు, డ్రెయిన్ల పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రౌండ్ లింక్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రతి గృహం మార్చి నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణ పనులను ప్రతివారం స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూడాలన్నారు. పిజీఆర్ఎస్‌లో అందిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి సక్రమమైన పరిష్కారాలు అందివ్వాలన్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వెంటనే తాగు నీరు, మరుగుదొడ్లు వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, డిపిఒ వి.రవికుమార్, సిపిఒ పి.త్రినాథ్, డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జ్ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎపిఇడబ్ల్యూఐడిసి ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


హెచ్ఎం మూర్తికి లాప్‌టాప్‌ను అందజేస్తున్న ఎన్ఆర్ఐ అనిశెట్టి స్వామి

దాతల సాయం వెలకట్టలేం

ప్రజాశక్తి - కాజులూరు

దాతలు సేవలు వెలకట్టలేమని శీల జడ్‌పి పాఠశాల హెచ్ఎం ఎన్ఎల్ఎన్.మూర్తి అన్నారు. గురువారం ఎన్ఆర్ఐ అనిశెట్టి స్వామి పాఠశాలకు రూ.60 వేలు విలువ చేసే లాప్‌టాప్‌తోపాటు, రాష్ట్ర క్రీడ పోటీలకు ఎంపికైన విద్యార్థుల ఖర్చులు నిమిత్తం రూ.20 వేలను హెచ్ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా అనిశెట్టి స్వామి మాట్లాడుతూ పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు ఉన్నప్పుడే విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారని అన్నారు. అందుకే పాఠశాలకు అవసరమైన లాప్‌టాప్‌ను అందించినట్లు తెలిపారు. అలాగే క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో తన వంతు సాయంగా క్రీడాకారుల కోసం రూ.20 వేలను అందించినట్లు చెప్పారు. పాఠశాలకు అవసరమైన రీతిలో సహకరించిన ఎన్ఆర్ఐ అనిశెట్టి స్వామికి హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోమలి వెంకటరమణ, పంచాయతీ సభ్యులు మాధవరపు చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు గోవిందరాజు, స్థానిక నాయకులు చొడిశెట్టి మురళీకృష్ణ, ముమ్మిడి గోపయ్య పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

ప్రజాశక్తి - గండేపల్లి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రైనర్

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 'ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో తాజా పరిశోధన ప్రవృత్తులు' అనే అంశంపై ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమం గురువారం ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.రాంబాబు, డాక్టర్ కె.బాపయ్యనాయుడు, డాక్టర్ వి.శ్రీనివాసరావు ఉపన్యసించారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.వీరాంజనేయులు, ఇతర విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపుదల చేసేందుకు కృషి చేయాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఆదేశించారు. గురువారం గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతి పురం హైస్కూలు, ప్రాథమిక పాఠశాలలను ఆమె సందర్శించారు. సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపర్ 2ను పరిశీలించారు. పలు విషయాలపై ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. లక్ష్మీపతిపురం హైస్కూల్లో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రాయుడు విజయలక్ష్మి, సిఆర్ఎం. టి.తరాల మీరాసాహెబ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని జగన్నాథగిరి గ్రామంలో జరిగిన ప్రమాదంలో సుంకర సురేష్(42) మృతి చెందాడు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని జగన్నాథగిరికి చెందిన సుంకర సురేష్ కె.గంగవరం మండలం కుందూరు రైసు మిల్లులో పని చేసి బుధవారం రాత్రి తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తూ జగన్నాథగిరి గ్రామ రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన సురేష్‌ను కుటుంబ సభ్యులు స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సురేష్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

పురుగుల మందు తాగిన వ్యక్తి ఆరోగ్యం విషమించి బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన వి.వీరబాబు(31) మద్యానికి బానిసై వివాహం జరిగి నాలుగేళ్లు అయినా సంతానం లేకపోవడంతో మనస్థాపానికి గురియై ఈ నెల 5వ తేదీన ఇంటి వద్దే గడ్డి మందు తాగాడు. దీంతో అతనిని కాకినాడ జిజిహెచ్‌కు కుటుంబీకులు తరలించారు. చికిత్స పొందుతూ అతని ఆరోగ్యం విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన ఎస్‌ఐ తెలిపారు.

కోడి వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ సీజ్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కోడి వ్యర్థాలను తరలిస్తున్న వ్యాన్‌ను మత్స్య శాఖ తనిఖీ అధికారి రాజేంద్ర సీజ్ చేశారు. యర్రవరం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేయగా కోడి వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న వ్యాన్‌ను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారని, కోడి వ్యర్థాలను ఊరికి దూరంగా పడేయడం జరిగిందని అన్నారు. ఎవరైనా చేపల, రొయ్యల చెరువులలో మానవుల అనారోగ్యానికి కారణమైన కోడి వ్యర్థాలను ఆహారంగా వేసినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసభ్యకర పోస్టులు పెడుతున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

సోషల్ మీడియాలో సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ అసభ్యకర పోస్టులు పెడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. రంగంపేట మండలం ఒడిశలేరుకు చెందిన వీరభత్తుల చంద్రశేఖర్ కొంతకాలంగా సోషల్ మీడియాలో అసభ్యంగా మార్ఫింగ్ చేసి పోస్టుంగులు పెడుతున్నాడు. దీంతో గోపాలపురం స్టేషన్లో ఐటి యాక్ట్ క్రింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రోడ్డు పై వర్షపు నీరు నిలిచిందని గత నెల 30న తల్లి, కొడుకుల పై దాడి చేసిన ఘటనపై బాధితుడు ఫిర్యాదు మేరకు ఈ నెల 6న కేసు నమోదు చేశారు.దీనికి సంబంధించి గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని సోమి దేవర పాలెం సోమాలమ్మ చెరువు ప్రాంతానికి చెందిన పెండెం విజయ్ ఇంటి వద్ద వర్షపు నీరు నిలిచింది. అదే గ్రామానికి చెందిన లంక దుర్గారావు నీరు నిలిచిపోయిందని విజయ్ తో వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి దుర్గారావు విజయ్‌పై భౌతిక దాడికి దిగాడు. ఈ ఘటనలో అడ్డువచ్చిన విజయ్ తల్లిపై దాడిచేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ విజయ్ తల్లిని ముమ్మిడివరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి పిర్యాదు మేరకు దాడికి పాల్పడిన దుర్గారావు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు.

బాలిక అదృశ్యంపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడులో ఒక ప్రయివేటు కళాశాలలో చదువుతున్న మైనర్ అదశ్యంపై పెద్దాపురం డిఎస్‌పి గురువారం విచారణ చేపట్టారు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో బాలిక నివాసానికి వెళ్లి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిఎస్‌పి శ్రీహరిరాజు ప్రత్తిపాడు ఎస్‌ఐ లక్ష్మీకాంతం కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిఎస్‌పి శ్రీహరిరాజు మాట్లాడుతూ బాలికను వెతికేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే తల్లిదండ్రులకు అప్పగిస్తామని భరోసా ఇచ్చారు.

ఉత్తరకంచిలో ముద్రగడ పర్యటన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని ఉత్తరకంచి గ్రామంలో వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రజలు చూపిస్తున్న అభిమానం, ప్రేమ, ఆప్యాయతలు, మరవలేనన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రజలు తన తండ్రి దగ్గర నుంచి అభిమానిస్తూనే ఉన్నారని అన్నారు. తనను ఉద్యమకారుడుగా తయారు చేసిన గ్రామం ఉత్తరకంచి అని గుర్తు చేశారు. సాగు నీటి కోసం రైతులు ఎంతో ఇబ్బంది పడేవారని, ఆ ఇబ్బంది లేకుండా ఉండేందుకే సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌతు స్వామి, జల్లిగంపల ప్రభాకర్‌రావు, చక్కపల్లి బాబు, లొండ బాబులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపును తొలగించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

తమ గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపును తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పెదబ్రహ్మదేవం పంచాయతీ కార్యాలయం కార్యదర్శి ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు లేఖను గురువారం పంపించారు. గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ అధ్యక్షతన పాలకవర్గం ఆమోదించిన తీర్మాణం కాపీని గ్రామ కార్యదర్శి లేఖ రూపంలో అందజేశారు. గ్రామంలో మద్యం దుకాణం లేనందున గ్రామంలో ఎక్కడ మద్యం బెల్ట్ షాపులు నిర్వహించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లా స్థాయి అధికారి అనధికార దందా

ఉద్యోగుల సంక్షేమ సంఘం పేరుతో అక్రమ వసూళ్లు
గార్డెన్ పార్టీ పేర సొమ్ములు దండుతున్న వైనం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

విద్యా శాఖలో ప్రస్తుతం ఆయనొక జిల్లా స్థాయి అధికారి. తన శాఖ పరిధిలో అంశాలను పక్కన పెట్టి ఇతర వ్యవహారాల్లో బాగా జోక్యం చేసుకుంటూ ఉంటారనే ప్రచారం ఆయనపై ఉంది. ఎవరి మెప్పు కోసమో తెలియదు కానీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఓ అనధికారి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఆయన. కార్తీక వన సమారాధన పేరుతో అడ్డగోలుగా అక్రమ వసూళ్లకు తెరలేపారు.

పిఠాపురం కాన్సిస్టెన్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిసిఇడబ్ల్యుఎ)ను ఏర్పాటు చేసి ఆయనే వ్యవస్థాపక అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 9న పిఠాపురంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కూటమికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా ఆహ్వానాలు కూడా పంపారు. అధికార పార్టీ నేతల మెప్పు పొందేందుకు 'జిల్లాస్థాయి అధికారి' అని కూడా మర్చిపోయి ఉద్యోగుల సంక్షేమ సంఘం పేరుతో అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారు. సంఘంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను సభ్యులుగా చేర్చి భారీగా ఫండ్ వసూలు చేస్తున్నారు.


PCEWA
PITHAPURAM CONSTITUENT
EMPLOYEES' WELFARE ASSOCIATION
PITHAPURAM Regd.No. 283 of 2024
Cell: 78158 83312, email: pcewa283@ gmail.com
No. : 539 Date
Received with thanks from
Designation SA English Cell:
Address
Rupees only towards General Fund.
Rs. 200/-
Signature

ప్రతి శాఖ నుంచి ఒక్కొక్కరిని ప్రతినిధిగా నియమించి ఆయా శాఖ ఉద్యోగుల నుంచి భారీగా వసూళ్లు చేస్తున్నారు. ఒక విద్యాశాఖ నుంచే మండలానికి రూ. 2 లక్షలు వరకూ వసూలు చేయాలని మండల విద్యాశాఖ అధికారులకు మౌఖికంగా హుకుం కూడా జారీ చేశారని సమాచారం. ఇలా నియోజకవర్గంలో రూ.6 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. విద్యాశాఖ అధికారులు ఆయా మండలాల్లో సిఆర్‌పిలను, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లను పాఠశాలలకు పంపి విద్యా శాఖలో ఒక అధికారి పంపారని చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. సంబంధిత జిల్లా అధికారి ఒక్కో ఉద్యోగి నుంచి రూ.200 నుంచి రూ.500 ...ఆపై వసూలు చేయిస్తున్నారు. మామూలుగా అయితే పార్టీకి నచ్చితే ఫండ్ ఇస్తారు లేకపోతే లేదని చెప్తారు. విద్యాశాఖ ఉన్నతాధికారి పేరు చెప్పుకుని వసూలు చేయడం విడ్డురంగా ఉందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ముక్కుపిండి సొమ్ములు దండుతున్న వైనం నియోజకవర్గమంతా వ్యాపించడంతో ఉద్యోగ వర్గాల్లో కలకలం రేగుతుంది. గార్డెన్ పార్టీ పేరుతో పవన్ కళ్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురంలో ఇటువంటి అనాధికార వసూళ్లు ఏమిటని పలువురు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. తమకు ఇష్టం లేకపోయినప్పటికీ గార్డెన్ పార్టీకి సొమ్ములు ఇచ్చి తీరాల్సిందే అంటూ ఉద్యోగులపై ఒత్తిళ్లకు సైతం పాల్పడుతుండడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. ఆ శాఖలో ఇతర జిల్లా అధికారులకు ఈ విషయం తెలిసినా చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత రాజశేఖర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డు కోవాలని, లేకుంటే దేశం సమగ్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అన్నారు. సిపిఎం కాకినాడ రూరల్ ప్రథమ మహాసభ ఇంద్రపాలెం కళ్యాణ మండపంలో కామ్రేడ్ ఆర్ఎస్ నగర్‌లో కామ్రేడ్ చుక్కన సత్యనారాయణ రాజు ప్రాంగణంలో గురువారం జరిగింది. తొలుత అరుణ పతకాన్ని సీనియర్ నాయకులు అంకం సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఏచూరి చిత్ర పటానికి రాజశేఖర్, పెద్దింశెట్టి రామకృష్ణ పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దింశెట్టి రామకృష్ణ, పి. నాగదేవి అధ్యక్షవర్గంగా ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ఈ సభకు రాజశేఖర్ హాజరై మాట్లాడారు. మండల కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు నివేదికను ప్రవేశపెట్టారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సభలో సీనియర్ నాయకులు దువ్వ శేషబాబ్జి, సిహెచ్.విజయకుమార్, జుత్తుగ శ్రీనివాసరావు, ఎంవి.రమణ, రాజా, సూర్యం, పద్మ, అజయ్‌కుమార్, సాహిత్, చంద్రరావు, లోవరాజు అంబటి రామకృష్ణ పాల్గొన్నారు.

సీతారామపురం సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తులు

తమ గ్రామంలో మురుగునీరు సమస్య పరిష్కరించి, రహదారి సౌకర్యాలు కల్పించాలని కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామస్తులు కోరారు. గురువారం గ్రామ సమస్యలపై తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గ్రామంలోని గొల్లల వీధి, కులాయి చెరువు ప్రాంతాలు చిన్నపాటి వర్షం కురిస్తే చెరువులా మారిపోతుందని అన్నారు. మురుగునీరు బయటకు పోయేందుకు వీలు లేకపోవడంతో దోమలు, ఈగలు పెరిగిపోయి ప్రజలు అనారోగ్యాలకు గురౌతున్నారని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తమ గ్రామంలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్రాజు సూర్యనారాయణ, రామకృష్ణ రాజు, పిల్లి ఏసురత్నం, సుధారాణి, కె.సత్యనారాయణ, పాపారావు, శివ ప్రసాద్, ఏడుకొండలు, కృష్ణ, బాబూరావు, వల్లు రాజుబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 104 ఉద్యోగుల వినతులు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న 104 ఉద్యోగుల వినతుల కార్యక్రమం కొనసాగుతోంది. జిల్లాలోని పలు కేంద్రాల్లో 104 ఉద్యోగుల సంఘం నాయకులు ఆయా వైద్యాధికారులకు గురువారం వినతి పత్రాలను అందించారు.


పిఠాపురంలో వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

ప్రజాశక్తి - యంత్రాంగం

కరప 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 వైద్య సేవలను పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ ద్వారా వైద్య సేవలు అందించాలని, 3 నెలలు వేతనా బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 104 సేవలను పిహెచ్‌సిల ద్వారా ప్రభుత్వమే కేవలం రూ.50 వేల ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృధా కాకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప అధ్యక్షురాలు వి.ఇందుమతి, రామకృష్ణ, దేవ, ఎస్‌కె.కలేశా, శ్రీకాంత్ పాల్గొన్నారు. **పిఠాపురం** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ రామచంద్రరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. తమకు రావాల్సిన మూడు నెలల వేతన బకాయిలతోపాటు, తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్ల రాంబాబు కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు దుర్గాదేవి, రాఘవ, సంతోష్ పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** 104 ఉద్యోగులు స్థానిక తహశీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అరబిందో యాజమాన్యంతో ప్రభుత్వం చర్చించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కేసెనకుర్తి ప్రసాద్, మద్దాల సతీష్, ఏడిద తాతాజి, గోంటేటి రవిబాబు పాల్గొన్నారు.

ఘనంగా సివి రామన్ జయంతి

భౌతిక శాస్త్రవేత్త సివి.రామన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. జిల్లాలోని పలు కేంద్రాల్లో జరిగిన ఈ వేడుకల్లో సివి రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట స్థానిక వివేకానంద పాఠశాలలో భౌతిక శాస్త్రవేత్త సివి.రామన్ జయంతి సందర్భంగా రెండు రోజులు పాటు జరిగే "సైన్స్ ఎక్స్పో" కార్యక్రమాన్ని గురువారం కరస్పాండెంట్ బిఎస్.సరోజినీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ -1 వై.శివరామకృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను, విలువలను పెంచే లక్ష్యంలో భాగంగా ఈ సైన్స్‌ఎక్స్పోలు పని చేస్తాయన్నారు. సైన్స్ ఎక్స్పోలో విద్యార్థులు వాటర్ అలారమ్, హైడ్రాలిక్ బ్రిడ్జి, రైన్ వాటర్ హార్వెస్ట్, డ్రిప్ ఇరిగేషన్ వంటి నూతన ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు సిహెచ్.వేంకటేశ్వరరావు, ఎగిక్యూటివ్ డైరక్టర్ శైలుషా, అకడమిక్ డీన్ వికాశా, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో గురువారం ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సివి.రామన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలోని సివి రామన్ విగ్రహానికి ప్రొఫెసర్ సంతానం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ అకాడమిక్ కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **గండేపల్లి** సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సివి.రామన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత సివి.రామన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ సుబ్బారావు, వివిధ శాఖల విభాగాధిపతులు, ఫాకల్టీ మెంబెర్స్, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పెద్దాపురప్పాడు విద్యార్థులు

ప్రజాశక్తి - కరప

పెద్దాపురప్పాడు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బేస్‌బాల్ అండర్-14, 17 విభాగాల్లో ప్రతిభ కనబర్చారని హెచ్‌ఎం ఎస్‌ఎస్‌ఎస్‌ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 2న కాకినాడ డిఎస్‌సి గ్రౌండ్స్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బేస్‌బాల్ అండర్-14, 17 జట్ల ఎంపికలకు పోటీలు నిర్వహించారు. పెద్దాపురప్పాడు జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన టి.పవన్‌శివకేశవ, వై.సుధీర్, డి.సూరయ వెంకటమణికంట, జి.వీరమణికుమార్, బాలికల విభాగంలో కె.సధ్యారాణి అండర్-17 జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 9 తేదీ నుండి 11 వరకు గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. అండర్-14 బాలురు జట్టుకు ఎన్.నాగేంద్ర, బి.అంజనీకుమార్, బాలికల జట్టుకు సిహెచ్.విజయలక్ష్మి, కె.అనురాధ, కె.కరుణశ్రీ ఎంపికయ్యారు. వీరు ఈ నెల 9 తేదీ నుంచి 11 వరకు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు బివివిఎస్‌వి.ప్రసాద్‌లను సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు, విద్యా కమిటీ చైర్మన్ యాళ్ల నాగమణి, ఎన్‌సిసి ఉపాధ్యాయులు తెల్లగాని వెంకట్రావు, గ్రామ పెద్దలు అభినందించారు.

ప్రమాదాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - జగ్గంపేట

గ్రామంలోని ప్రజలు సైబర్ నేరాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రామవరం సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామవరం గ్రామం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నందున గ్రామస్తులంతా రోడ్డు దాటే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లసెల్‌ఫోన్ ద్వారా లింకులు పంపి బ్యాంకు ఖాతాల్లో నగదును దోచుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయరాదన్నారు. గంజాయి, సారా, ఇతర మత్తు పదార్థాలను తయారుచేసినా, అమ్మినా, రవాణా చేసినా జగ్గంపేట సిఐ 9440796529, జగ్గంపేట ఎస్‌ఐ 9440796569 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ టి.రఘునాథరావు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన తండాలో పర్యటిస్తున్న ముదునూరి

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. గురువారం మండలంలోని గిరిజన తండా ప్రాంతమైన బౌరేఖలో ఆయన పర్యటించారు. గ్రామంలో నెలకున్న సమస్యలను గిరిజనులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని అన్నారు. ఈ పర్యటనలో సర్పంచ్ దొడ్డి సత్తిబాబు, ఎంపిటిసి సభ్యులు అమరావతి కాశి జగన్నాథం, నాయకులు రామిశెట్టి బుల్లి రామకృష్ణ, బంకు శీను, బెహరా దొరబాబు, బొడ్డు చిన్న, పాల్గొన్నారు.

బెల్టు షాపులను తొలగించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - కోటనందూరు

లగుడు శ్రీనివాస్

గ్రామాల్లో మద్యం బెల్టుషాపులను తొలగించాలని కోటనందూరు ఎంపిపి లగుడు శ్రీనివాస్ కోరారు. బెల్టుషాపులను తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనలు చేస్తున్నా అధికారులు సిఎం ఆదేశాలను కూడా అమలు చేయట్లేదన్నారు. బుధవారం నాడు రాత్రి బిళ్లనందూరులో బెల్టుషాపు నిర్వాహకుడిని గ్రామస్తులు ప్రశ్నించారన్నారు. వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడారు. బెల్టు షాపులు సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై స్థానిక పోలీసులకు, ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రోత్సాహం

ప్రజాశక్తి - పెద్దాపురం

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని మాజీ మున్సిపల్ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యానిర్వహణ కార్యదర్శి రాజా సూరిబాబురాజు అన్నారు. పెద్దాపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒలింపిక్స్‌లో క్రీడాకారులకు ప్రోత్సాహన్ని ఇస్తూ చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారునికి రూ.75 లక్షలు ఇచ్చే ప్రోత్సాహన్ని రూ.7కోట్లకు పెంచడం అభినందనీయమన్నారు. అలాగే స్పోర్ట్స్ కోటాను 2 శాతం నుంచి మూడు శాతం పెంచి గ్రూపు వన్ ర్యాంకు ఉద్యోగాన్ని కూడా కల్పించే విధంగా ప్రభుత్వం అడుగులు వేయడం ద్వారా క్రీడాకారులకు గుర్తింపునిస్తుందన్నారు.

రైల్వే యూనియన్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - సామర్లకోట

డిసెంబర్ 4, 5 తేదీల్లో జరగనున్న సామర్లకోట బ్రాంచ్ రైల్వే యూనియన్ సంఘాల ఎన్నికల ప్రచారాన్ని గురువారం రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభం అయింది. స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందని, అందుకే ఇక్కడ నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టినట్లు యూనియన్ కార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ జి.గణేశ్వరరావు, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ వైఎన్.బాబులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గాడిమొగ పిహెచ్‌సి వైద్యురాలు శ్యామల అన్నారు. గురువారం పిహెచ్‌సి అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేన్సర్‌ను ముందుగా గుర్తించడానికి ఈ స్క్రీనింగ్ పరీక్షలు ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన అందరికీ ఉచితంగా ఈ పరీక్షలు చేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ కుమారి, ఎంపిహెచ్‌ఇఒ బొడ్డు కుమార్, కాలా ఆంజనేయులు, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శిశు రక్షణపై అవగాహన

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శిశురక్షణపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో గర్భిణులకు రోగులకు శిశు రక్షణపై అవగాహన కల్పించారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు. లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. మానవ అక్రమ రవాణా నివారణ, చట్టాలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సభ్యులు కె.నూకరాజు, ఎ.గీత, వైద్యులు పి.పూజిత, ఎస్.సబీనా, తేజ, పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ వల్ల ప్రమాదం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక పంచాయితీ శ్రీరంగనాయకపురం ఎమ్‌టి.రాజు బంగ్లా వద్ద ఆర్‌అండ్‌బి రహదారిపై ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను గుర్తించలేక ఒక వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. బుధవారం రాత్రి పెదవలసల నుంచి తాళ్ళవు వైపు వస్తున్న యానాం మెట్టకూరుకు చెందిన కర్రి నాగరాజు బైకుపై వెళుండగా స్పీడ్ బ్రేకర్ కనపడక పోవడంతో వాహనం పైనుంచి కింద పడ్డాడు. ఈ ప్రమాదంతో తలకు తీవ్రగాయమైంది. పలువురు ప్రమాదాలకు లోనవుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ప్రయాణికులకు స్పీడ్ బ్రేకర్ కనిపించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

నేడు ఎంపిడిఒ కార్యాలయంలో సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నేడు బాల్యవివాహాల నిరోధ చట్టంపై అవగాహన సదస్సు జరుగుతుందని సిడిపిఒ జి.ఉష తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వీటిని నిరోధించేందుకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

యానాం వార్తలు

ఎంఎల్ఎ గొల్లపల్లి సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - యానాం

డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాలకు సంబంధించి సమస్యలను తెలుసుకున్నారు. సాగు, తాగునీటికి ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని ఫిర్యాదులు రావడంతో అరటికాయలంకలో ఉన్న పంపు హౌస్‌ను పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. మోటర్లు పనిచేయకపోవడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పిడబ్ల్యుడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మోటర్లు రిపేరు చేయించి తాగు, సాగునీటికి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రాజరాజేశ్వరి నగర్ లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించిన సమస్యను పరిష్కరించారు. అంబేద్కర్ విజ్ఞాన్ భవన్లో అంబేద్కర్ విగ్రహానికి వెనకాల రూ.13 లక్షలతో స్టెయిన్లెస్ స్టీల్‌తో నూతన మెట్లు నిర్మాణం చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. ట్యాక్సీ స్టాండ్ సమీపంలో అస్తవ్యస్తంగా ఉన్న ప్రధాన డ్రెయినేజీని పరిశీలించి దానికి శాశ్వత పరిష్కారం చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ల నాగరాజు, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, జెఇ భాస్కర్‌జ్యోతిరాజు పాల్గొన్నారు.

ఉల్లాస్‌పై శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి - యానాం

స్థానిక సమగ్ర శిక్ష అభియాన్ సమావేశపు మందిరంలో ప్రాంతీయ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న 33 పోలింగ్ బూత్‌లలో 33 మంది సర్వేయర్లను నియమించి వారికి శిక్షణ ఇచ్చారు. 15 సంవత్సరాలు వయసు పైబడిన వారికి చదువు నేర్పే క్రమంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి వారి జాబితాను రూపొందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ విద్యాశాఖ అధికారి, ఉల్లాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పంపన లక్ష్మణ ప్రవీణ్, ఉల్లాస్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కర్రి భవాని ప్రసాద్, కోఆర్డినేటర్స్ ఓలేటి దుర్గా మహాలక్ష్మి, ఎ విజయలక్ష్మి, మిషన్ స్త్రీ శక్తి సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SRINIVAS GOWD BOLLA (NEW NAME), S/o Musalayya" Previously called "BOLLA SRINIVAS (OLD NAME)" Dr. No. 2-2A-5/2, Park Road, Nidadavole, West Godavari District (Now East Godavari District), A.P., Have changed my name in Passport No. L2935037 "BOLLA SRINIVAS (OLD NAME) is changed to "SRINIVAS GOWD BOLLA" Hence after all my Documents and Correspondence will be continue With my new name SRINIVAS GOWD BOLLA.

మహారాజశ్రీ 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 123/2024

Between:
సత్తి మురళీకృష్ణ -వాది
మరియు
1. ఆకుల శ్రీనివాసు, S/o. సత్యనారాయణ, వయస్సు 48, ప్రైవేటు ఎంప్లాయి, డో.నెం. 2-31, జేగురుపాడు, కడియం మండలం, తూ॥గో॥జిల్లా.
2. ఆకుల సత్యవేణి, W/o. శ్రీనివాసు, హిందువు, వయస్సు 42, గృహిణి, డో.నెం. 2-31, జేగురుపాడు, కడియం మండలం, తూ॥గో॥జిల్లా.
-1, 2 ప్రతివాదులు

పై నెంబరు దావాలో 1, 2 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 20-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వి.సత్యమూర్తి
రాజమండ్రి అడ్వకేట్, రాజమండ్రి
07-11-24 సెల్:9866539256

NAME CHANGE

I, **ANAND NALLA,** S/o. **N.Palla Rao,** R/o. D.No. 67-1-3, Ashok Nagar, Kakinada 533003 have changed the name of My Minor Son **ORANGE PRINCE RAAVAN NALLA** (Old Name), aged 15 years and he shall hereafter be known as **ORANGE PRINCE NALLA** (New Name).

NAME CHANGE

I, **ANAND NALLA,** S/o. **N.Palla Rao,** R/o. D.No. 67-1-3, Ashok Nagar, Kakinada 533003 have changed the name of My Minor Son **MILIND MANGO PRINCE NALLA** (Old Name), aged 14 years and he shall hereafter be known as **MANGO PRINCE NALLA** (New Name).

సర్టిఫికెట్లు పోయినవి

కాకినాడ జిల్లా, ఏలేశ్వరం మండలం, ఏలేశ్వరంకు చెందిన కశిరెడ్డి లక్ష్మిశ్రీ నివేద్, తండ్రి: రాజబాబు అనే నాకు చెందిన **పదో తరగతి మార్కులు జాబితా నెంబర్: 1808134535** మరియు **ఇంటర్ మార్కులు జాబితా నెంబర్: 2003255369** ఒరిజినల్ సర్టిఫికెట్లు జిరాక్స్ నిమిత్తం ఏలేశ్వరం బాలాజీ చౌక్ సెంటర్‌కు తీసుకురాగా పోయినవి. ఆచూకీ తెలిసినవారు ఈ దిగువ చిరునామాకు తెలియజేయగలరు.

కశిరెడ్డి లక్ష్మి శ్రీ నివేధ్
తండ్రి: రాజబాబు, ఏలేశ్వరం
ఏలేశ్వరం మండలం, సెల్: 9848357318

పోయినవి

సింగంశెట్టి మోహన్‌రావు, S/o. సుబ్బారావు, R/o. డో.నెం. 82-5-3/1, Elite Home, ఫ్లాట్ నెం. 201, 1వ వీధి, విద్యుత్ నగర్, ఎ.వి.అప్పారావు రోడ్డు, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నా యొక్క **లక్ష్మి మారుతి ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్** కంపెనీకి సంబంధించిన రాజమండ్రి **ICICI బ్యాంక్, దానవాయిపేట బ్రాంచ్‌కు** చెందిన **2 చెక్ బుక్స్,** మా స్థలంకు సంబంధించిన దస్తావేజులు జిరాక్స్‌లు, **ప్రామిశరీ నోట్లు** సంతకం పెట్టినవి మరియు సంతకాలు పెట్టిన చెక్కు ఇవ్వన్ని కూడా ICICI బ్యాంకు, రాజమండ్రి దానవాయిపేట బ్రాంచ్‌కి సంబంధించినవి మరియు **ఫోరం స్టాంప్స్, అడ్రస్ స్టాంప్స్** మరియు **మేనేజింగ్ డైరక్టర్ స్టాంప్స్,** విలువైన దస్తావేజులు పేపర్స్ అన్ని **బ్యాగ్‌లో** పెట్టుకొని **ది. 25-10-2024వ తేదీన** నేను నా ఇంటి నుండి నా బైక్ వెనుక హుక్కుకి తగిలించుకుని ICICI బ్యాంకుకి వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికిన కనిపించలేదు. కనుక ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను. నా బ్యాగ్ దొరికి తెలియపర్చిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును.

సింగంశెట్టి మోహన్‌రావు
R/o. డో.నెం. 82-5-3/1, Elite Home, ఫ్లాట్ నెం. 201, 1వ వీధి, విద్యుత్ నగర్, ఎ.వి.అప్పారావు రోడ్డు రాజమండ్రి, సెల్: 9550639999

IN THE HON'BLE COURT OF THE V ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1626/2019

Between:
Pandranki Uma Maheswara Rao ...Plaintiff
And:
Smt. Gundala Rajani Kumari ...Defendant

SUMMONS

To, The Defendant:
Smt. Gundala Rajani Kumari,
W/o. Kotayya, Hindu,
aged 50 years,
R/at D.No.80-17-21,
Padmavathi Residency,
J.N. Road, Rajahmundry.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **18-11-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **18-11-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
P.A. NARASIMHAM,
K. SANDEEP,
G.V.A. KISHORE &
CH.N. SUDHA,
Advocates,Visakhapatnam.